సాక్షి
వికారాబాద్
శనివారం । 22 । జూలై । 2023



పేరుకే పెద్ద ప్రాజెక్టు

ఉమ్మడి జిల్లాకే తలమానికంగా ఉన్న కోట్‌పల్లి జలాశయం.. నిర్వహణ లోపంతో కళతప్పింది.

11లో▸

న్యూస్‌రీల్

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

దౌల్తాబాద్: ఉద్యాన తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ తిరుమలస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదెకరాల లోపు భూమి, ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన వారు ఇందుకు అర్హులని చెప్పారు. వన్‌– బీ, జాబ్ కార్డు, ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, జిరాక్స్ కాపీలతో ఈనెల 31లోగా ఈజీఎస్ ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. మామిడి, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, గులాబీ, మల్లె, మునగ మొక్కలను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడంతో పాటు తోటలకు నిర్వహణ ఖర్చులు అందజేస్తుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు హార్టికల్చర్ ఈజీఎస్, అధికారులను సంప్రదించాలని సూచించారు.

పశువులకు మేతగా చిక్కుడు..

ధర లేక రైతన్న నిరసన



చిక్కుడు కాయలను పశువులకు మేతగా వేసిన రైతు

పరిగి: కూరగాయల ధరలన్నీ భగ్గుమంటున్న తరుణంలో చిక్కుడుకు మాత్రం ధర లేకపోవడంతో చేసేదిలేక ఓ రైతు పశువులకు మేతగా వేశారు. సయ్యద్‌పల్లికి చెందిన నర్సింహులు ఎకరా 20 గుంటల్లో చిక్కుడు పంట సాగు చేశాడు. శుక్రవారం పరిగి మార్కెట్ కావడంతో చిక్కుడు కాయను తీసుకువచ్చాడు. మార్కెట్‌లో చిక్కుడుకు కిలో ధర రూ.10కూడా పలకలేదు. చేసేది లేక చిక్కుడు కాయలను పశువులకు మేతగా వేశాడు. సాగు కోసం రూ.50 వేల వరకు వెచ్చించానని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



మహిళా సమాఖ్య సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ కృష్ణన్

కుల్కచర్ల: గ్రామల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు వారికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని డీఆర్డీఓ పీడీ కృష్ణన్ అన్నారు. శుక్రవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో సమాఖ్య సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలకు రుణాలను అందించి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడమేకాక, సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల్లో నీటిని తొలగించండి

వికారాబాద్ అర్బన్: ఎడతెరిపిలేని వర్షాల వల్ల పంటలకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాధార పంట పొలాల్లో భారీగా వర్షం నీరు చేరిందని, వెంటనే నీటిని బయటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పంటల సాగు విషయంలో రైతులు తప్పకుండా వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు వరి నాట్లు వేయని రైతులు ఈ వర్షాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం కరాస్పాండెంట్ల ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, హ్యాండ్ బుక్‌ను విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆవిష్కరించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, సంఘం జిల్లా అధ్యక్షుడు జి.నారాయణరెడ్డి, కార్యదర్శి భరత్‌కుమార్‌తో కలిసి శుక్రవారం మంత్రి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులను మంత్రి అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల సమగ్ర సమాచారం, ప్రభుత్వ జీవోలు, వివిధ రకాల ఉత్తర్వులను అందులో పొందుపర్చినట్లు నారాయణరెడ్డి తెలిపారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న జుంటివాగు

వరద బీభత్సం

భారీ వర్షాలతో జిల్లాలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో వరద బీభత్సం సృష్టించింది. 96 గంటల పాటు విస్తారంగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటల్లోకి కొత్త నీరు చేరి జలకళను సంతరించుకున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలో సగటున 81.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వందలాది ఎకరాల్లో పంటలు మునక

- జిల్లాను ముంచెత్తిన వానలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- నిండుకుండలా చెరువులు, కుంటలు
- ప్రధాన ప్రాజెక్టుల్లోకి భారీగా చేరిన వరద
- పలుచోట్ల స్తంభించిన రాకపోకలు

• పోటెత్తిన జుంటివాగు

బషీరాబాద్: కురుస్తున్న భారీ వర్షాలకు కాగ్నానది ఉరకలెత్తుతోంది. శుక్రవారం కాశీంపూర్, గోనూరు మధ్య ఉన్న జుంటివాగు పొంగిపొర్లుతోంది. జీవన్గీ దగ్గర కాగ్నానది నిండుగా పారుతోంది. మహాదేవలింగేశ్వర స్వామి ఆలయం నీటమునిగింది. మండలంలోని చెరువులు మత్తడి దూకుతున్నాయి. అల్లాపూర్ చెరువుకు గండిపడింది. కుప్పన్‌కోట్, బషీరాబాద్, బబ్దాపూర్, అల్లాపూర్ గ్రామాల్లో నాలుగు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. రెవెన్యూ, పోలీసు శాఖలు ఎప్పటికప్పుడు చెరువులు, నదుల దగ్గర పర్యవేక్షిస్తున్నారు. ఆయా గ్రామాల్లో లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో జనం అవస్థలు పడుతున్నారు.

వికారాబాద్: జిల్లాలో గడిచిన 24 గంటల్లో వర్షాలు మరింత ఉధృతమయ్యాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. కొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు అలుగుపారుతున్నాయి. ప్రధాన ప్రాజెక్టులన్నీ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంటున్నాయి. జిల్లాలోని 45 చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల రాకపోకలు స్తంభించాయి. కలకచర్లలో అత్యధికంగా 13.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఐదు మండలాల్లో 10 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం రికార్డు అయ్యింది. జిల్లాలో సగటున 81.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధాన ప్రాజెక్టులైన శివసాగర్, నందివాగు, జుంటుపల్లి, కోట్‌పల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి తదితర ప్రాజెక్టులు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువులో ఉన్నాయి..

క్షేత్రస్థాయిలో కలెక్టర్, ఎస్పీ..

భారీ వర్షాలు కురుస్తుండటంతో పరిస్థితులను కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి సమీక్షించారు. అధికారులతో వీడియో కాన్ఫరెన్స్, సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అధికారులకు సూచనలు చేశారు. గుర్తించిన ప్రమాద స్థలాల వద్ద రెవెన్యూ, పోలీసులు కాపలా ఉండేలా ఏర్పాట్లు చేశారు. యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వానలు తగ్గే వరకు ఎవరూ బయటకు రావద్దని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల్లోంచి వెళ్లవద్దని, ఈ మేరకు గ్రామాల్లో దండోరా వేయించాలని కలెక్టర్ యంత్రాంగానికి సూచించారు. వాగుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. వికారాబాద్ నుంచి పరిగికి, ధారూరు నుంచి దోర్నాల్ వెళ్లే దారుల్లో బ్రిడ్జలపైనుంచి వరద ప్రవహించటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వర్ష తీవ్రతకు పలు చోట్ల రోడ్లకు గండ్లు పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. పరిగి మండల పరిధిలోని ఓ చెరువుకు గండి పడింది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది.




పంటలను ముంచెత్తిన వరద



బొంరాస్‌పేట : ఇళ్లను ముంచెత్తిన వరదలో స్థానికులు

• అనంత సోయగం



అనంతగిరుల్లో జల సవ్వడి ఎగిసిపడుతోంది. కురుస్తున్న వర్షాలకు గుట్టల మధ్యలోంచి వరద ఒక్కసారిగా కిందికి దుముకుతోంది. చూపరులకు జలపాతాన్ని తలపిస్తోంది. జల సోయగాలను తిలకించేందుకు పర్యాటకులు, చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు తరలివస్తున్నారు. అనంతపద్మనాభుడి ఆలయ ప్రాంగణంలోని మెట్లపై నుంచి సైతం వరద నీరు పారుతోంది. – అనంతగిరి

• కోట్‌పల్లికి భారీగా వరద

20 అడుగులకు చేరిన నీరు



ధారూరు: మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఎనిమిది అడుగుల మేర నీరు ఉన్న ప్రాజెక్టు.. క్రమంగా 20 అడుగులకు చేరింది. మరో నాలుగు అడుగుల మేర నీరు చేరితే పూర్తి స్థాయిలో నిండుతుంది. వర్షాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్న సమయంలో పూర్తి స్థాయిలో నిండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్టులోకి వచ్చే వరద ఉధృతి మేరకు అంచనా వేయవచ్చని ప్రాజెక్టు ఇరిగేషన్ డీఈ భాస్కర్ తెలిపారు. ధర్మాపూర్ వాగు నిరవధికంగా ప్రవహించడం.. ఆ నీరంతా కోట్‌పల్లి ప్రాజెక్టులోకి చేరడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. వడ్లనందు ఫౌండేషన్ చైర్మన్ నందు, కొండాపూర్‌కలాన్ సర్పంచ్ పరమేశ్‌లు శుక్రవారం ధర్మాపూర్ వాగును పరిశీలించారు.

• అత్యవసరమైతేనే బయటకు రండి

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

నవాబుపేట: కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చించల్‌పేటలో ఎస్పీ కోటిరెడ్డితో కలిసి పర్యటించారు. చించల్‌పేట్ సమీపంలోని మూసీ నదిపై నిర్మించిన వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. బ్రిడ్జి దగ్గర ఉన్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులు పొలాల వద్దకు వెళ్లవద్దన్నారు. అత్యవసరమైతేనే బయటకు రావాలన్నారు. గ్రామాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ విజయ కుమారి, తహసీల్దార్ రవీందర్, సర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్తులు ఉన్నారు.



మూసీనదిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

• వాగులో చిక్కుకున్న రైతులు.. కాపాడిన గ్రామస్తులు



వరదనీటిలో చిక్కుకున్న వారిని కాపాడుతున్న స్థానికులు

ధారూరు: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో చిక్కుకున్న రైతులను గ్రామస్తులు కాపాడారు. ఈ ఘటన మండల పరిధిలోని మైలారం సమీపం మొండికుంట వాగు వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంపల్లితండాకు చెందిన లోక్యానాయక్, తార్యానాయక్, లచ్చానాయక్, అంజిబాయి, యాదయ్యలు కలిసి ట్రాక్టర్‌పై పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లికి బయలుదేరారు. సాగుకు తమ పొలాలను సిద్ధం చేయడానికి కావాల్సిన ఇనుప వీల్స్ కోసం వీరంతా మన్‌సాన్‌పల్లికి బయలుదేరారు. వీరు మొండికుంట వాగులోంచి వెళ్తుండగా మధ్యలోకి వెళ్లేసరికి ట్రాక్టర్ మునిగిపోయింది. వారంతా ట్రాక్టర్ పైభాగానికి చేరుకుని బిగ్గరగా అరుస్తున్నారు. గమనించిన గ్రామస్థులు వెంటనే వేరే ట్రాక్టర్‌ను తీసుకువచ్చి తాడు సహాయంతో వారిని ఒడ్డుకు చేర్చారు. వారంతా ప్రాణాలతో బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

రైలింజన్ పైకెక్కి వృద్ధుడి హల్‌చల్

హైటెన్షన్ తీగను పట్టుకునే ప్రయత్నంలో గాయాలు



గాయాలపాలైన వృద్ధుడు

తాండూరు టౌన్: తాండూరు రైల్వేస్టేషన్‌లో నిలిచిన ఓ రైలింజన్ పైకి ఓ వృద్ధుడు ఎక్కి హల్‌చల్ చేశాడు. హైటెన్షన్ తీగను పట్టుకునేందుకు యత్నించి గాయాలపాలయ్యాడు. ఈఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం కల్లూరుకు చెందిన 60 ఏళ్ల కొండం చంద్రశేఖర్ మతి స్థిమితం కోల్పోవడంతో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోనే తిరుగుతుండేవాడు. హైదరాబాద్ నుంచి ముంబయి వెళ్తున్న హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్ రైల్వేస్టేషన్‌లో ఆగింది. ఆ సమయంలో చంద్రశేఖర్ రైలింజన్ పైకెక్కి హైటెన్షన్ తీగను పట్టుకునేందుకు యత్నించాడు. అక్కడున్న వారు ఎంత వారించినా వినలేదు. ఇంతలో రైలు కదలడంతో ఇంజన్‌పై పడిపోయాడు. దీంతో వృద్ధుడికి గాయాలయ్యాయి. స్థానికులు అందరూ కలిసి అతన్ని కిందకు దింపి, చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీగకు చేయి తగిలి ఉంటే పెను ప్రమాదం జరిగేదని, రైలు కదలడంతో ముప్పు తప్పిందని ప్రయాణికులు అంటున్నారు.



రైలింజన్ పైభాగంలో హైటెన్షన్ తీగను పట్టుకునేందుకు యత్నిస్తున్న వృద్ధుడు

గురుకులంలో కలవరం

- అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్
- ఒక్కసారిగా ఎగిసిపడ్డ మంటలు
- భయాందోళనతో పరుగులు తీసిన విద్యార్థినులు

మొయినాబాద్: అర్ధరాత్రి.. జోరువాన.. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో విద్యుత్ మీటర్‌లో మంటలు.. అది చూసి భయాందోళనకు గురైన విద్యార్థినులు హాహాకారాలు చేస్తూ వర్షంలోనే పరుగులు తీశారు. ఈ సంఘటన మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం వెనకాల ఉన్న శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాలివి.. గురుకుల పాఠశాల భవనంలో గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ మీటర్‌లో మంటలు చెలరేగాయి. ఒకవైపు వర్షం పడుతుండగా.. మరోవైపు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మంటలు ఎగిసి పడటంతో నిద్రలో ఉన్న బాలికలు ఉలిక్కిపడి లేచారు. ఎటువెళ్లాలో అర్థంకాక భయంతో బయటికి పరుగులు తీశారు. సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ ఏవీ రంగా, ఎస్‌ఐ ప్రణయ్‌తేజ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గురుకులంలో ఉన్న మొత్తం 517 మంది విద్యార్థినులను బయటకు తీసుకొచ్చారు. మెయిన్ ఆఫ్ చేసి నీళ్లతో మంటలను ఆర్పారు. కొంతమంది బాలికలను పోలీస్‌స్టేషన్, మరికొంతమందిని సమీపంలో ఉన్న మల్లికార్జునస్వామి ఆలయంలోకి తరలించారు. లైన్‌మన్‌ను పిలిపించి మరమ్మతులు చేయించిన అనంతరం విద్యార్థినులను గురుకులం భవనంలోకి తిరిగి తీసుకొచ్చారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



గురుకులం వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం..

ఘటనా స్థలాన్ని శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పరిశీలించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే షార్ట్ సర్క్యూట్ జరిగిందని మండిపడ్డారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ, ఎంపీటీసీ ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాలకు వచ్చారు. తమ పిల్లలను పంపించాలని ప్రిన్సిపాల్, ఆర్‌సీఓతో వాగ్వాదానికి దిగారు.



షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వచ్చిన విద్యుత్ మీటర్

సమస్యలు లేకుండా చూస్తాం



మీటర్ కెపాసిటీ సరిపోక షార్ట్‌సర్క్యూట్ అయినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. భవనానికి సరిపడే కొత్త మీటర్ ఏర్పాటు చేయడానికి డీడీ కట్టాం. సమస్యలన్నీ పరిష్కరించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– శారద, గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి

క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కార్యాలయ సిబ్బంది ప్రకటన విడుదల చేశారు. వాతావరణ శాఖ ప్రకటించినట్లుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఇళ్లలోనే ఉండాలన్నారు. రైతులు పొలాల్లో విద్యుత్ స్తంభాల దగ్గర తెగిన వైర్ల దగ్గర జాగ్రత్తగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, నీటి ప్రవాహక ప్రాంతాలకు వెళ్లరాదని సూచించారు.

కొడంగల్ ఫలహారం బండికి ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న సంఘం సభ్యులు

కొడంగల్: నియోజకవర్గ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలోఈనెల 16న కొడంగల్‌లో పెద్దమ్మ తల్లి ఫలహారం బండి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలంగ్‌వాడీలోని ముదిరాజ్ భవనం నుంచి బస్టాండ్ వరకు ఆట పాటలతో అలరించారు. గురువారం రాత్రి ఉత్తమ బోనాలు, ఫలహారం బండి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ చేతుల మీదుగా ఉత్తమ బోనాలు, ఉత్తమ ఫలహారం బండి అవార్డును అందజేశారు.కార్యక్రమంలో ముదిరాజ్ యువ జన సంఘం అధ్యక్షుడు బాల్‌రాజ్, కోశాధికారి నరేశ్‌రాజ్, వెంకటస్వామి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు మహిళ బలవన్మరణం

తాండూరు రూరల్: వరకట్న వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండల పరిధిలోని అల్లాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన బుర్ర లాలప్ప, మమత(30) దంపతులు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కొన్ని రోజులుగా మమతను ఆమె భర్త లాలప్ప, అత్త యశోద, ఆడపడుచు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. వేధింపులు తట్టుకోలేని ఆమె మధ్యాహ్నం ఇంట్లో దూలానికి ఉరేసుకుని బలవన్మరణం చెందింది.ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ నుంచి అరుణాచలం టూర్

30న హైదరాబాద్ నుంచి ప్రయాణం

తాండూరు టౌన్: ఆగస్టు 1న పౌర్ణమిని పురస్కరించుకుని టీఎస్‌ఆర్టీసీ తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి స్పెషల్ బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తాండూరు డిపో మేనేజర్ సమత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టూరిజం ప్యాకేజీలో భాగంగా హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్, జేబీఎస్ బస్‌స్టేషన్ల నుంచి ఈ నెల 30న రాత్రి 9 గంటలకు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరుతాయన్నారు. 31న కాణిపాకంలోని విఘ్నేశ్వరుడి దర్శనం ఉంటుందన్నారు. అనంతరం సాయంత్రం 3 గంటలకు తమిళనాడు రాష్ట్రం వేలూరులోని గోల్డెన్ టెంపుల్ దర్శనం.. తర్వాత రాత్రి 9 గంటలకు అరుణాచలం చేరుకుంటాయన్నారు. తిరిగి ఆగస్టు 1న సాయంత్రం 6 గంటలకు అరుణాచలం నుంచి బయలుదేరిన బస్సులు 2న ఉదయం 6 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటాయన్నారు. భక్తులు తమ సీట్లను ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ డిపోల్లోనూ.. జంట నగరాలలోని ఏటీబీ ఏజెంట్ల వద్ద తీసుకోవచ్చన్నారు. టీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లోనూ టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఆలయంలో దర్శనం, అల్పాహారం, భోజనం, వసతి సదుపాయాలు భక్తులే ఏర్పాటు చేసుకోవాలన్నారు. వివరాలకు 9959226257, 9959224911 (ఎంజీబీఎస్), 9959226246 (జేబీఎస్) ఫోన్‌లలో సంప్రదించవచ్చన్నారు.

జల దిగ్బంధం

- నీట మునిగిన పంటలు
- కూలిన ఇళ్లు
- స్తంభించిన జనజీవనం

జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా వర్షాలు ముంచెత్తాయి. దీంతో జనజీవనం స్తంభించింది. రోడ్లు తెగిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జిల్లా వ్యాప్తంగా వాగులు వంకలు ఉధృతంగా పొంగిపొర్లుతున్నాయి. వరద ప్రవాహం పెరగడంతో ప్రాజెక్టుల్లోకి నీరు భారీగా చేరింది. పలు చోట్ల ఇళ్లు కూలిపోయాయి. పంటలు నీట మునిగాయి. – సాక్షి, నెట్‌వర్క్



దోమ: బొంపల్లిలో కూలిన ఇల్లు



కుల్కచర్ల: మరికల్‌లో అలుగుపారుతున్న చెరువు



పూడూరు: పుగుదుర్తి కత్వవాగు ప్రవాహంతో ధ్వంసమైన రోడ్డు



నిండుగా పారుతున్న కంకల్ ఈసీ వాగు



యాలాల: జలకళను సంతరించుకున్న జుంటుపల్లి ప్రాజెక్టు



కొడంగల్ రూరల్: పెద్ద చెరువులోకి చేరిన నీరు



కొడంగల్: బుల్కాపూర్‌లో కూలిన ఇల్లు



తాండూరు రూరల్: ఐనెల్లిలోని పొలంలో నిలిచిన వర్షపు నీరు



అనంతగిరి: ఉధృతంగా ప్రవహిస్తున్న వికారాబాద్ వాగు



కుల్కచర్ల: వర్షానికి కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పెద్దేముల్: మారేపల్లితండాలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మప్ప



దౌల్తాబాద్: కుదురుమళ్ల వాగువద్ద రహదారిని మూసివేయిస్తున్న ఎస్‌ఐ



పెద్దేముల్: ఇందూరు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐ రాజిరెడ్డి



ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న సుందర్



పరిగి: వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



బొంరాస్‌పేట: మహంతీపూర్ వాగును పరిశీలిస్తున్న ఎస్‌ఐ శంకర్ తదితరులు



మోమిన్‌పేట: కూలిన ఇంటి వద్ద బాధితురాలు



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో ఉధృతంగా పారుతున్న గంగమ్మవాగు




కొడంగల్ రూరల్: మంగలికుంట అలుగు



మోమిన్‌పేట: ఏన్కతలలో ఇళ్ల మధ్య చేరిన వర్షపు నీరు



దోమ: ఊటుపల్లిలో చెరువును తలపిస్తున్న పొలం



కొడంగల్: అలుగు పారుతున్న నందారం చెరువు



పరిగి: సోందేపూర్ చెరువు కట్ట తెగడంతో పారుతున్న వరద

రైతులు సూచనలు తప్పక పాటించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

పూడూరు: రైతులు అప్రమత్తంగా ఉండి వర్షాల నుంచి పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తి, మేడికొండ గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పంట పొలంలో నీరు నిలవకుండా చూడాలని నీరు నిలిస్తే మొక్కలు పచ్చ రంగులోకి మారే అవకాశం ఉందని అన్నారు. 10 గ్రాములు పొటాషియం, 19:19:19 వాడాలని సూచించారు. మొక్క ఎదుగుదలను బట్టి యూరియా వేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించి పంటను కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సంధ్యారెడ్డి, అనంత్‌రెడ్డి, ఏఈఓ తులసీరాం, ఏఈఓలు ఇలియాస్, వర్ష, గీత, శిరీష, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలివే..

పెద్దేముల్: అధిక వర్షాలు కురుస్తున్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి నజీరుద్దీన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కందనెల్లి, ఖానాపూర్ గ్రామాలల్లో పర్యటించి వర్షాలకు పాడైన పంటలను పరిశీలించారు. పత్తి, కంది, మొక్కజొన్న పంటల మధ్య వర్షం నీరు నిలవకుండా చుడాలని సూచించారు. పంటలు పసుపు రంగు మారితే 10 గ్రాముల పోటాషియం నైట్రేట్, లేదా 19-19-19 మందును నీటిలో కలిపి పంటలపై పిచికారి చేయాలన్నారు. పంటల ఎదుగుదలకు వర్షాలు నిలిచిన తరువాత ఎకరాకు 25 కిలోల యూరియ, 10కిలోల పొటాష్ ఎరువులను కలపి మొక్కకు సెంటి మీటర్ల దూరంలో వేసుకోవాలన్నారు. అధిక తేమ వల్ల పత్తి మొక్కలకు వేరు కుళ్ల తెగుల్లు సోకకుండా మూడు గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా ఓ గ్రాము కార్బెండిజం లీటర్ నీటిలో కలపి ఆ ద్రావణాన్ని తెగుల్లు సోకిన మొక్కల పాదుల చుట్టు నేలపై వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు.

నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి

యాలాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పత్తి, కంది పంటల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి యాదగిరి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోకట్, రాఘవపూర్ గ్రామాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించారు. పంటల్లో నీరు నిల్వ ఉండకుండా కాల్వలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు ఎరువులు, పురుగుల మందులను పిచికారీ చేయరాదన్నారు. వర్షాలు తగ్గాక సూక్ష్మధాత పోషకాల లోపాలను సవరించడానికి యూరియా ద్రావకాన్ని లేదా డీఏపీ ద్రావకాన్ని పంటలపై పిచికారీ చేసుకోవడంతో ఎదుగుదల ఉంటుందన్నారు. ఆయన వెంట ఏఈఓ మదన్‌మోహన్ ఉన్నారు.



పెద్దేముల్: ఖానాపూర్‌లో నీటమునిగిన పంటలను పరిశీలిస్తున్న ఏఓ నజీరుద్దీన్

విత్తనాలు మొలకెత్తకుంటే..

తాండూరు రూరల్: భారీ వర్షాల కారణంగా పొలాల్లో నిలిచిన నీటిని తొలగించాలని వ్యవసాయశాఖ ఏడీఏ రుద్రమూర్తి రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని గౌతపూర్ గ్రామంలోని నీట మునిగిన పత్తిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. విత్తనాలు మొలకెత్తకపోతే తిరిగి విత్తుకోవాలని సూచించారు. పత్తి, మొక్కజొన్న, కంది పంటల్లో అధిక నీటిని తీసివేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ శ్రీనివాస్ ఉన్నారు.